క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్నాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

అంకమ్మ తల్లికి విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు కుంకుమార్చనలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు

గుణదల(విజయవాడతూర్పు): నగరంలో గంజాయి వినియోగాన్ని నియంత్రించి, మత్తు పదార్థాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. ఏసీపీ మాటల్లో తెలంగాణా రాష్ట్రం ములుగు జిల్లా, మంగపేట ప్రాంతానికి చెందిన పెదపూడి సాయి ప్రకాష్ (21) చదువుకు స్వస్తి పలికి అక్రమార్జనకు అలవాటు పడ్డాడు. గంజాయిని అమ్మితే ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని భావించి ఈ వ్యాపారంలోకి దిగాడు. బెంగళూరుకు చెందిన సంపత్, ఏలూరుకు చెందిన పూర్ణ అనే వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. వీరి సహకారంతో గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తుల నుంచి గంజాయిని తీసుకున్న ప్రకాష్ బందరు రోడ్డులోని లబ్బీపేట ప్రాంతంలో కొంత మందికి సరఫరా చేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న మాచవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారు. ఇతని వద్ద 1,700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సాయి ప్రకాష్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కేసులో మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నామని ఏసీపీ చెప్పారు.

నేర రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా పాలన

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- పోలీసు అధికారులతో కలిసి అర్ధరాత్రి విస్తృత పర్యటన



అజిత్‌సింగ్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేర రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా ప్రభుత్వం పాలన అందిస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అజిత్ సింగ్‌నగర్‌లో పోలీసులతో కలిసి ఆయన వినూత్నంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోలీస్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి స్వయంగా పర్యటించారు. లూనా సెంటర్, రాఘవాచారి పార్కు వీధి, ఎంకే బేగ్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేశారు.

రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలి..

స్థానిక ప్రజలతో స్వయంగా మాట్లాడి సమస్యాత్మక ప్రదేశాలపై ఆరా తీశారు. అర్ధరాత్రి వరకు ఆకతాయిలు రోడ్ల మీద తిరుగుతూ ఇబ్బందులు కలిగిస్తున్నారని.. వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆకతాయిల ఆగడాలకు చెక్ పెడతామని.. అర్ధరాత్రి కూడా మహిళలు స్వేచ్ఛగా తిరిగే విధంగా సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తామని మల్లాది విష్ణు భరోసా ఇచ్చారు. అల్లరి మూకల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల మేరకు తాము తనిఖీలు జరిపినట్లు తెలిపారు. అలాగే నేరాల నివారణకు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. రాత్రి 9 గంటల నుంచే చురుగ్గా గస్తీ నిర్వహించాలన్నారు. ఎక్కడైనా మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తూ తిరిగితే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా అర్ధ రాత్రిళ్లు బైక్‌లపై అవారాగా తిరుగుతూ అల్లర్లు చేసే యువకుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే రాక తెలుసుకొని కొందరు స్థానిక మహిళలు ఆయనను కలిసి మాట్లాడారు. సమస్యను దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అర్ధరాత్రి అయినా ఆయా ప్రాంతాల్లో పర్యటించి తమకు ధైర్యాన్ని కల్పించిన మల్లాది విష్ణుకి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఎండీ హాఫీజుల్లా, నందెపు సురేష్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



దుర్గాపురంలో వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యకర జీవనం సాగించాలని వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు సూచించారు. స్థానిక దుర్గాపురంలో ఆదివారం డాక్టర్ ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలు దోహదపడతాయన్నారు. డాక్టర్ ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ మాట్లాడుతూ.. నగరంలో నిరుపేదలకు ఆరోగ్యసేవలు అందించేందుకు, తాము ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు చేయించి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. అనంతరం 298 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విజయ్ నర్సింగ్ స్కూల్‌లో..

దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, అల్లోపతి వైద్యులు డాక్టర్ ఆదిత్య చంద్రబొట్ల ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 320 మందికి వైద్య పరీక్షలు చేశారు.

చురుగ్గా రహదారి విస్తరణ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ బీ జానారెడ్డి ఆదేశాల మేరకు వర్షాలు కురుస్తున్నప్పటికీ రోడ్డు పనులను జేసీబీ సహాయంతో చురుగ్గా చేస్తున్నారు. ఇక్కడ ఒక వైపు అంతర్గత రోడ్లు నిర్మాణం జరుగుతున్నప్పటికీ మరో వైపు మెయిన్ రోడ్డు బురదగా మారటంతో రోడ్డు సెక్షన్ పనులు చేపట్టారు. వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బంది పడకుండా పనులు పూర్తి చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.

వీసీబీ సభ్యుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు



నగదు అందజేస్తున్న బ్యాంకు డైరెక్టర్లు చంద్రశేఖరరావు, వెంకట రమణారావు, కోటేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెండు తెలుగు రాష్ట్రాల్లో 50 బ్రాంచిలుగా విస్తరించి ఉన్న విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు(వీసీబీ) సభ్యుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ బ్యాంకు డైరెక్టర్ వి.చంద్రశేఖరరావు తెలిపారు. అందులో భాగంగా పటమట, వన్‌టౌన్ బ్రాంచిల్లోని సభ్యుల పిల్లలు ఏడుగురికి రూ.45 వేల చెక్కులు, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. పటమట ఫన్ టౌమ్స్ క్లబ్ రోడ్డులోని వీసీబీ బ్రాంచిలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది బ్యాంకు సభ్యుల పిల్లలకు రూ.24 లక్షలతో ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో 90 శాతం మార్కులకు పైగా సాధించిన వారికి రూ.5 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.7,500, నీట్‌లో వెయ్యిలోపు ర్యాంకర్‌కు రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందించామన్నారు. బ్యాంకు డైరెక్టర్లు పొట్లూరి వెంకట రమణారావు, చిన్నం కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రహ్మణ్యం, మేనేజర్లు కె.కొండబాబు, సీహెచ్ సత్యనారాయణ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

భర్త బెదిరింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్య, అత్త, బావమరిదులను చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన వేలదండి శ్రావణి, రౌతు ప్రసాద్ భార్యభర్తలు. శ్రావణికి ప్రసాద్ రెండో భర్త. శనివారం సాయంత్రం కాలనీలోనే నివాసం ఉంటున్న అత్త వద్దకు వెళ్లి ఆమెను, శ్రావణిని చంపుతానని బెదిరింపులకు పాల్పడటమే కాకుండా నోటికి ఇష్టం వచ్చినట్లు దూషించసాగాడు. ఇదేమిటని ప్రశ్నించిన బావమరిది సాయిని కూడా దూషించడమే కాకుండా చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయం



మాట్లాడుతున్న పన్నాల సుబ్రహ్మణ్య భట్టు, వేదికపై లక్ష్మీనారాయణ, గోళ్ల నారాయణరావు

విజయవాడకల్చరల్: దివంగత సాహితీమూర్తుల సేవలు సదా స్మరణీయమని అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో దివంగత సాహితీమూర్తులు ఆచార్యకేతు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ సంస్మరణ సభను గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పెనుగొండ మాట్లాడుతూ.. తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుల్లో కేతు విశ్వనాథరెడ్డి ఒకరని తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేవన్నారు. సంగీత సాహిత్య విమర్శకుడు పన్నాల సుబ్రహ్మణ్య భట్టు శ్రీ రమణ గురించి మాట్లాడుతూ రాసి కన్నా వాసికి ప్రాధాన్యత నిచ్చిన సాహితీ దిగ్గజం శ్రీరమణ అని అభివర్ణించారు. పేరడీ కవిత్వానికి దిశానిర్దేశం చేసిన శ్రీరమణ తన కథల ద్వారా అద్భుతాలనే సృష్టించారన్నారు. ఆయన ప్రతిభకు మచ్చుతునక మిథునం కథ చాలన్నారు. సభను సమన్వయ పర్చిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. మనుషులు కనుమరుగైనా వారి సాహిత్యం సజీవంగానే ఉంటుందన్నారు. సంస్మరణ సభలో బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర నాయుడు, సభ్యులు బెల్లపు బాబ్జీ, పల్లవి వెంకట నారాయణ, గుత్తికొండ లక్ష్మీ, లక్ష్మయ్య, సాహితీవేత్తలు పాల్గొన్నారు. విశ్వనాథరెడ్డి, శ్రీరమణ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ప్రతి ఒక్కరిలో మానసిక సమస్యలు



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి, నివాస్, వైద్యులు రాధికారెడ్డి, ఇండ్ల రామసుబ్బారెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలతో సతమతమవుతున్నారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. మానసిక సమస్యలు ఉన్న వారికి ఇండ్లాస్ చక్కని చికిత్సా కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. సూర్యారావుపేటలో ఏర్పాటు చేసిన ఇండ్లాస్ వెల్త్ అండ్ గైడెన్స్ క్లినిక్‌ను ఆదివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల కారణంగా కొందరు, సామాజికంగా అనేక కారణాలతో మానసిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తల్లిదండ్రుల బిజీ లైఫ్ కారణంగా పిల్లలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, వైద్యులు ఆర్.వెంకటేశ్వరరావు, ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశాల్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



అజిత్‌సింగ్‌నగర్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచారానికి నిరసనగా అజిత్ సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో ఇమ్మానియేల్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యాన సంఘ విశ్వాసులు ఆదివారం నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ బాప్టిస్ట్ చర్చి సంఘం సెక్రటరీ అలపర్తి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మణిపూర్ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోకుండా మోదీ సర్కారు ప్రజలను మోసం చేస్తోందన్నారు. నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సన్నీ బాబు, సంఘం అధ్యక్షుడు కోలా శ్యామ్, కోశాధికారి అలపర్తి ఈనోక్, బెజవాడ డేవిడ్, పెద్ద సంఖ్యలో చర్చి సంఘ సభ్యులు, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కనకదుర్గ నృత్య మందిర్‌కు చెందిన కళాకారులు ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ధర్మ పథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.

అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆకర్షణీయంగా

కనకదుర్గ ఫ్లైఓవర్







విజయవాడ నగరాన్ని, సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా కనకదుర్గ ఫ్లైఓవర్ పిల్లర్లకు వేస్తున్న పెయింటింగ్‌లు, గార్డెనింగ్ నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



30న 'కథ చెబుతారా ..ఊ కొడతాం' పోటీలు



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ధర్మప్రచార పరిషత్ సభ్యులు

విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం కథ చెబుతారా.. ఊ కొడతాం ధార్మిక కథల పోటీ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ధర్మపరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం అధ్యాపకులు, న్యాయనిర్ణేతల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చుట్టుగుంటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా లయన్స్ క్లబ్ కార్యాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలో ఒకటో నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పాల్గొనాలని కోరారు. కథలు, భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, భారతీయ సంస్కృతి సంప్రదాయలకు సంబంధించి కథలు ఉండాలని సూచించారు. విజేతలకు కేటగిరిల వారీగా బహుమతులను అందజేస్తామన్నారు. జిల్లా ధార్మిక పరిషత్ సభ్యులు రమణారావు, బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికలలోని ప్రతిభను గుర్తించి వారికి హిందూ సంస్కృతి పట్ల అవగాహన కలిగించడానికి కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో మంగిపూడి వెంకటశాస్త్రి, ఉప్పులూరు శేషప్రసాద్, విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ పాల్గొని, బ్యానర్‌ను ఆవిష్కరించారు. వివరాలకు 70322 55499 సంప్రదించాలని కోరారు.

ఇంటి నిర్మాణ శంకుస్థాపనకు ఆత్మీయ ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అమరావతిలో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఈ శుభ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఇళ్ల స్థలాలు పొందిన 40వ డివిజన్‌లోని లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్, వలంటీర్లు బొట్టు పెట్టి ఆహ్వానించారు. ఆదివారం వారు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశానుసారం 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి సూచనల మేరకు సంప్రదాయం ప్రకారం కుంకుమ బొట్టు పెట్టి శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి జగనన్న శంకుస్థాపన చేసే కార్యక్రమానికి బొట్టు పెట్టి ఆహ్వానించడం ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కోడి పందేలు వేస్తున్న నలుగురిని నున్న పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పళతిప్ప వద్ద బహిరంగ ప్రదేశంలో కోడి పందేలు వేస్తున్న షేక్ మస్తాన్, బడుగు రాజేష్, జె.సాంబయ్య, ఎస్.సతీష్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, 14 మోటారు సైకిళ్లు, రూ.4,350 లను స్వాధీన పర్చుకొన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు.

అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని సరస్వతీ సామాజ్య అధ్యక్షుడు అయ్యంకి మురళీకృష్ణ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం అంతరిక్ష వారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అంతరిక్ష రంగంలో భారతదేశ విజయాలు, ప్రయోగాలు, స్పేస్ షిప్ తదితర అంశాలను వివరించారు. ఇటీవల భారత్ ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడం గర్వించదగ్గ విషయమన్నారు. చంద్రయాన్–3 భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్ర యాత్ర అన్నారు. భారత చంద్రయాన్ కార్యక్రమంలో ఇది మూడోవదని, చంద్రయాన్–2 లో మాదిరిగా ఇందులోనూ రోవర్, ల్యాండర్ ఉన్నాయన్నారు. గ్రంథాలయ అధికారి రమాదేవి, సిబ్బంది ధనలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.